# కొండ గుండె మండింది

ఆంధ్రప్రదేశ్‌లోని ఏజన్సీ ప్రాంతంలో ఒక ప్రాజెక్టు నిర్మాణానికై అక్కడి గిరిజనులను తొలగించడం జరిగింది. వారికి సరయిన పునరావాస సౌకర్యాలను కలుగజేయలేక పోడంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

అలాగ నిర్వాసితుడు చేయబడిన ఒక గిరిజనుడు ప్రాజెక్టు అధికారులలో ఒకరిపై హత్యా ప్రయత్నం చేయబోయాడని... అతన్ని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరచగా... ముద్దాయి అయిన ఆ గిరిజనుడు న్యాయమూర్తికి చేసుకున్న హృదయ విదారకమయిన విన్నపమే ఈ కథకు మూలమూ ఆధారమూ.

దండాలు బాబూ దండాలు... దరమ ప్రెబువుకి దాసుడి దండాలు. కోరటోరికి కోటి దండాలు.

నేరం జేశావా అని నిలదీసినారండి నల్లకోటు బాబు. నేరమేదో గోరమేదో తెలుసుకోగలిగితే ఒక లేనిదే ముంటదండి? నిజంగా నాకు తెలవట్లేదండి, నేను జేసింది ఒప్పో తప్పో. పీడన్నెట్టుకుంటావా అని కూడా సెప్పినారండి పెద్దోరు. బాబూ! పీడన్నెట్టుకోగల తోమతే ఉంటే... నల్లకోటుకి రూకల మూటందించగల శక్తి ఉంటే నాకీ గతెందుకు పడతదండీ? ఐనా... ఉన్నమాటున్నట్లుగా సెప్పడానికి నిజం నిక్కచ్చిగా సెప్పుకుందుకు మధ్యవర్తెందుకండి మహానుబావులూ?

జరిగిందేటో సెబుతానండి. మోదకొండమ్మ సాచ్చిగా.. అడివితల్లి మీద ఆనగా... సెట్టూ పుట్టా మీదొట్టేసి... పోతురాజు మీద ప్రెమాణికం జేసి సచ్చేమే పలుకుతానండి. నా మాట విని... నేనేం జేశానో ఇని... ఆనక తమరే సెబుదురుగానండి న్యాయమూ దరమమూ. ఐతే బాబులూ... నా బాద ఏరండి నా బాస ఏరండి అరదం జేసుకుందుకు తమరిక్కొంచెం స్రెమే ఐతదో ఏటో... మన్నించండి.

"సోదె ఆపి సంగతి చెప్పు. ప్రాజెక్ట్ ఆఫీసరు మీద హత్యా ప్రయత్నం చేశావా లేదా?" గద్దింపు.

గిరిజనుడు ఒక్క క్షణం బిక్క చచ్చిపోయి మెల్లగా తేరుకుని "బాబూ! తవరు పెద్దలు. సదూకున్నోళ్లు. నట్టనోళ్లు, నేనేమో సిన్నోణ్ని. సదూకోనోణ్ని కొండోణ్ని మీర్నన్ను కంగారు పెట్టి కచ్చులో కందులేసేస్తే నేనేటి సెప్పలేను. మీ ముందిలా నిలుసుందుకే కాళ్ళొణికి పోతన్నాయి నాకు. పది పులుల మజ్జ ఒంటిరి మేకలా నజ మజ ఒణుకొచ్చేత్తాంది. బెగిలి పోతన్నాను" అన్నాడు దీనంగా. "సర్లే నాకు చేతనయినట్లే చెప్పు" అనుమతించారు న్యాయాధీశులు... దయతో.

"మీ దయకు దండాలు సామీ. సచ్చి మీ కడుపున పుడతాను. ప్రెబువులూ! ఇప్పుడైతే అకడికడ ప్రాజెక్టున్నాది. మరంతకు ముందు? అక్కడేటుండేది? కొండుండేది, బండలుండేవి. అడవుండేది, చెట్లుండేవి, వనముండేది, వృచ్చాలుండేవి. మేముండే వాళ్ళం గూడెం ఉండేది. గూడెమంటే మా కొండోళ్ళుండే గూళ్ళు. ఊరు... ఊరంటే మరేటీ కాదు. పాతిగ్గుడిసెలు. సిన్నా పెద్దా ముసిలీ ముతకా ఆడా మగా అంతా కలిసి ముప్పాతిక మందిమి. మా గూడెం పేరు

సెంచుపాకల. ఇప్పుడా గూడెమూ లేదు, గూళ్లూ లేవు. వనమూ లేదు మేమూ లేము. ఎందుకు నేకుండా పోయాయో అదెలా జరిగిందో సెబుతాను సామీ.

పొదలోంచి పులిలా అదాత్తుగా ఓ మోటరొచ్చింది. శానాకాలం కితం. వొచ్చీ, అడివికీ మకూ బొమ్మల్దీశారు. కొలతలూ తీశారు. బలే బాగుందని సంకలు గుద్దుకున్నాం. అళ్ళు మాకు నిప్పు పెట్టెలూ అవీ ఇస్తే, తర్వాత కొన్నాళ్ళకు గొప్ప మనసులొచ్చి రోడ్డేస్తమనీ... పన్జెయ్యమనీ అడిగినారు. దుడ్డిస్తమన్నారు పనికి. సంబరపడిపోయాం. రోడ్డు... తురుబురు మోటార్లు అంటే సరదా కదా? రోడ్డొచ్చేసినాది. కొత్త నారీలూ నరమానవులూ తిరగసాగారు. మరి కొన్నాళ్ళకి జీపు కారేసుకుని ఇద్దరో ముగ్గురో దొరల్లాటి బాబులొచ్చింద్రు. ఒక్కో గుడిసె యజమానినీ రమ్మన్నారు. సారా పోయించారు. బిస్కత్తుతో రొట్లూ ఇచ్చేరు. ఆపైన కాగితాల్దీసి ఆటిమీద అందర్నీ ఏలిముద్దర్లు గుద్దమన్నారు. సిత్రంగా అనిపించి చకచక గుద్దేసినామంతే... అప్పుడాళ్ళు మా సేతుల్లో డబ్బు కాగితాలు పెట్టారు. ఆనంద పడిపోయాం వాటి నందుకుని. అప్పుడేమో... "వారం తిరిగేలోగా ఇక్కడ్నుంచి పోవాలి" అన్నారు వాళ్ళు. పిడుగులా పడిందా మాట మా అందరిమీదా.

"ఎందుకు? మేమేం తప్పు జేశామనీ? ఏడుపు మొహాలేసి అడిగాం.

"మీకు డబ్బిచ్చేశాం. మీ వేలకీ గుడిసెలకీ పరిహారం చెల్లించాం. మీరు పోవాలంతే"

"మమ్మల్ని పొమ్మని... ఏం జేయాలని?"

"దేశాభివృద్ధి కోసం... ఆర్థికాభివృద్ధి కోసం... మల్టీపర్పస్ ప్రాజెక్టు కడతాం. డామ్... ఎలక్ట్రిసిటి... రోడ్స్"

ఆ మాటలు మా కరదమవలేదు. మా కరద మయిందొకటే. డబ్బిచ్చి అళ్ళు మా అడివినీ, వొండనీ మమ్మల్నీ కొనేసి మమ్మల్ని ఇక్కణ్నుంచి పొమ్మంటున్నారని. మమ్మల్ని అడివి తల్లి వొళ్ళోంచి లాగీయొద్దనీ మేం మరెక్కడా బతకలేమనీ ఏడుసుకున్నాం. పెడబొబ్బ లెట్టుకున్నాం. "బాబులూ! మేం కొండోళ్ళం. కోయోళ్ళం. అడివి బిడ్డలం. అడివి మాయమ్మ. కొండ మా తండ్రి. సెట్లు మా సుట్టాలు. గట్టూపుట్టా మా నేస్తాలు. అడివిలో పుట్టి... అడివిలో పెరిగి అడివిలోనే అంతమయ్యే అడివి మడుసులం మేం. అంచేత మమ్మల్ని అడివిలోంచి లాగేస్తే అమ్మనుంచి ఆత్మనుంచీ లాగేసినట్లే. మేం మరెక్కడా మనుగడ సాగించలేం. మీ పట్నవాసపోళ్ళ మల్లె పెద్ద సదువులకనో, ఉజ్జోగాల కనో, యాపారాలకనో ఉన్నూరినీ కన్నోరినీ ఇడిసి పైకి పోడం మా కలవాటు నేదండి. ఏటి బాబూ సణుగుతున్నారు?

మీ కొండ దొరలు టౌన్లంట దిరిగి జాతకాలు సెప్పడం లేదా? వనమూలికలూ వనాంత్రాలూ అమ్ముకుందుకు కొండదిగి పట్నాలంట తిరగడం లేదా? మరందుకు మన్యమొదిలి మరో చోటున మకాం వేయడం లేదా?...అవేనా?

ఎందుకు దిగరు బాబూ? దిగుతారు. కొందరు కొండ దిగుతారు. సింతపిక్కల తోపా, మావిడ టెంకల జీడి అంబలీ కూడా దొరక్క... తిండిక్కరవయిన కొందరు కొండ దిగుతారు, బతుకు బండలయిపోకుండా. అలాగే... అడివి పంటలు, తేనే, కరక్కాయలు, మూలికలూ, మందులూ మైదానం వాళ్ళక్కూడా అందించాలనీ అమ్ముకోవాలని మరి కొందరూ కొండ దిగుతుంటారు. ఐతే అళ్ళకో ఆసుంటుంది. మళ్ళీ కొన్నాళ్ళకో అడివమ్మ ఒడి జేరుకోగలమనీ, తన గూడూ గుండే అయిన గూడెం చేరుకోగలమనీ. ఆ ఆశా నమ్మకమూ తోనే అళ్ళు అడివవతల ఏడాది కాన్నెల్లుండ గలుగుతారు.

ఒక చిన్న యిషయం బాబూ. లేడుంది దానికో కూనుంది. ఆ కూన కమ్మంటేనే ప్రాణమూ ప్రపంచమూ, ఐనా మేత మేసేందుకు కుసింత సేపటూ ఇటూ పోతూంటుందమ్మని వొదిలి. ఆ పని కాంగానే మళ్ళీ వొచ్చి అమ్మ పక్కలోనూ డొక్కల్లోనూ ముడుచుకుంటుంది.

గిరిజనులూ అంతేబాబూ. అమాయకపు లేడి కూనలూ, అడివికూనలూ. తప్పనిసరయి మన్యం వదిలినా నాల్రోజులయ్యే సరికి మళ్ళీ ఎనక్కిలగెత్తు కొచ్చారే. అంచేత మమ్మల్ని మా అడివికి దూరం సెయ్యకండి దొరలూ... అని నెత్తీ నోరూ కొట్టుకున్నా మండందరమూ కాని ఆబడాబాబులు కతరు సెయ్యనేదండి. లేళ్లింతేడిస్తే మాత్రం పులులిని పించుకుంటాయేటండి? అళ్ళు మనిషి పులులండి మా గోడిన్లేదండి.

సర్కారోళ్ళే ఎవరో ఆ దొరలు మాకు దుడ్లిచ్చారన్చెప్పాను కదండీ, అంత సొమ్ము మేం అంత వరకూ మా జనమలో కళ్ళ జూల్లేదండి. ఒక్కసారి అంత సొమ్ము చూసేసరికి మాకు మైకం కమ్మేసి మతి పోనాదండి. ఆ సొమ్ము... పిచ్చోడి చేతిలో రాయిలా ఒకేయిదిన సలపరమెట్టేస్తున్నాదండొక వేపు. మరో వేపు సారా కంట్రాక్టర్ల హుషారు పిలుపులండి. 'ఎప్పుడూ తాగే ఇప్పసారా జీలుక్కల్లూ నేటి? ఇస్కీ తాగండి. బ్రాందీ తాగండి సీసాల్లోది తాగండి. కంపెనీ సరుకు తాగండి. సొమ్ముండగానే సొరగం సూడండి' అంటూ తెగూరించేసేరు.

మాలో కొందరు– ఆఫీసర్లిచ్చిన డబ్బుని కాస్తా కంపెనీ బుడ్ల కర్చించేసి బికారులైపోయి గోసీపాతల్తోనే మిగిలారండి కొంచెం మంది జాగ్రర్తపరులు ఆపేసిర్లిచ్చిన సొమ్ము లట్టుకుని కొండ దిగువన మైదానపూళ్ళలో ఇల్లో బూమో కొనబోయినారు కానీ... పట్నవాసపోళ్ళు ఈళ్ళన్జూసి పకాలున నవ్వేసినారండీ. పెడీపెడీ నవ్వేసినారండి. నువ్విచ్చే సొమ్ముకి యిల్లు కాదు కదా బొమ్మ కూడా రాదని యికిలించీసేరండి. పొలం కాదు కదా గట్టుకూడా రాదని పక్కుమన్నారండి. అప్పుడు తెలిసిందండి ఆపీసర్లు నష్టపరిహారమంటూ ఇచ్చిన దుడ్డు శానా సల్పమనీ దానితో కొండ దిగువన ఏవీ రావనీ. ఇల్లు పోయి సొమ్మొచ్చింది కానీ ఆ సొమ్ముకి మళ్లీ ఇల్లు రాదనీ, మాకు శానా అన్నాయమైపోయందనీ పూర్తిగా అరదమైపోనాదండీ. ఐతే... కొద్ది కాలం మా&రతం బాగానే జరుగుబాటయిందండి. ఎందు కనంటే... పాజెక్టు కట్టడాలకీ... రోడ్లకీ బండపన్లకీ మమ్మల్ని వాడుకుని దుడ్లిచ్చే వొరండి. ఆ పన్లయిపోయాక మమ్మల్ని తగిలీసేరండి, అవసరం తీరాక ఆకుని అవతల పారేసినట్లు. సచ్చినట్లు ముకాలేలాడేసుకుని కొండదిగామండి విది లేక. అప్పట్నుంచి మొదలయ్యాయండి మా కష్టాలు. అక్కడ మాకు పన్లు దొరక్కపోవడమే కాక పడరాని పాట్లు పడవలసి ఒచ్చిందండి. ఓ తెన్నున కాదండి. అనేక ఇదాల. మాకండీ, అంతా కొత్తేనండీ. ఊరు కొత్త, తీరు కొత్త. సెట్టు కనబడదు, సేను కనబడదు. సేతికి పని కాపడదు. తెల్లార్నేస్తే చెట్టెక్కా గట్టెక్కాగా అడివిలో బతికినాళ్ళం కదండీ. ఇక్కడ తీరు తెన్నులకి బతుకు గోచరించక అంతా అయోమయం అడివి పంచాంగవూ ఐపోనాదండి. సెరువులో సేపల్దీసి ఒడ్డున యిసిరేస్తే నాగ బతకనేక గిలగిలలాడి పోయావండి. విలవిలలాడి పోయామండి.

కొండ దిగువ... కట్టు, బొట్టు, తిట్టు, వొట్టు, అన్నీ వేరేకదండీ, కొత్తే కదండీ, కొట్టుకు పోనామండి. మా కొండ మీద అడివి మీదా దీవేసిపోనాదండి. మైదానంలో మా బతుకు కాదు కదండీ? అడివిలో కొండలంటా కోనలంటా తిరిగి తేనెపట్టులు కొట్టడం... కాయ లేరడం, మొక్కామోదూ సవిరించడం... తునికాకు కొయ్యడం... ఇలాటి పన్లతో పొద్దోయేదండి. గూడెంలో ఐతే సీకటడే సరికింత అంబలో గెంజో పొట్టలో పడీసుకునీ... ఇప్ప సారాయో కల్లో పట్టించేసీ ఆడామగా పిల్లాపాప

ఊరిమజ్జ సెట్టు కింద సురడమూ... ఆటాపాటా మొదలెట్టడమూ. కొమ్ము బూరా వూదీవాడొకడయితే కంజిరి కొట్టేవాడొకడు. డప్పు వేసే వాడొకడైతే సివవెత్తి సిందులేసే దొకతె. అద్దరేతిరి వరకూ అంతా అనందమే. పైలా పచ్చీసే. అదీ బతుకంటే. మైదానంలో కొచ్చాక ఆ మజా ఏదీ? దినమునకొక తూరయినా మోదకొండమ్మని చూసుకోకపోతే మనసుండదే. ఏదీ మోదకొండమ్మెక్కడ? ఆట నేదు, పాటనేదు, దైవంనేదు, బతుకు నేదు. ఎండిపోయి మండిపోతున్న గుండెల్తో కొండెక్కాను.

అక్కడ జూసేసరికి నాకు మతే పోయింది. బయమేసిందొక్కతూరి. ఏదీ మా అడివి తల్లి? ఏమై పోయింది? ఎవరెత్తుకు పోయారు? మా చెట్లనీ... చుట్టాలనీ... మా అన్నదాతలని నామరూపాలు కూడా మాగలకుండా ఏ కరకు చేతులు నరికేశాయి? మేం పోడెవసాయం జేసుకుందుకోమూల నాలుగు మొక్కల్నరికితేనే నేరమన్నాడే గార్డు? జుల్మానా వేశాడే! జెయిల్లో పెట్టేస్తానని బెదిరింపులు బెదిరించాడే! చెట్టు నరకడం చాలా తప్పని చెప్పిందే చెప్పాడే. కోడలికి బుద్ధులూ సుద్దులూ చెప్పి అత్తే రంకు కెళ్ళినట్లు అదికార్లే ఎందుకడివిని నాశనం జేశారు? ఒకటీ రెండూ చెట్లు కాక ఏకంగా అడివినే అంతం జేసేశారే. ఆళ్ళకి జుల్మానా వెయ్యడా గార్డు? ఆళ్ళని ఎన్నాళ్ళు జెయిల్లో పెడితే సరిపోతది శిక్ష? ఆ బవనాలూ సిమెంటు కట్టడాలూ చూస్తుంటే కళ్ళల్లో నిప్పులు పడ్డట్లే గుండెలు మండిపోతున్నాయి నాకు.

మా అడివిని లాగేసుకుని మా తల్లి నుంచి మమ్మల్ని తరిమేసి... మా నేల మీద మా బతుకుల మీద ఆళ్లు బవనాలు లేపి... మమ్మల్ని నిలనీడా దిక్కూ లేని వాళ్ళని చేశారా అదికారులు. మా చెట్టూ మట్టీ తవ్వేసి మా మడుసుల్ని కప్పెట్టేసి మా సమాది గోతుల్లో పునాదుల్తీసి మా బొమికెల మీద బవనాలు కట్టారా అదికారులు! దాన్నేటేనా సెయ్యబోతే... కోపం తెప్పిస్తే పశువంటిదే కొమ్మిసుర్తుందే! సాలీసాలని సొమ్ము మా చేతబెట్టి, జెల్లకొట్టి పొమ్మన్న... మా బతుకుల్ని కుట్రతో దగాసేసొగ్గిన ఆపీసర్ల మీద మా కొళ్ళు మండకుండా ఉండగలదా? గుండె రగలకుంటుందా? ఈ సెంపగొడితే ఆ సెంప జూపియ్యడానికి మేమేమన్నా ఏస్తుక్రీస్తుల మేటి, ఏబ్రాసి మడుసులంగాని. మా గుడెసెలూ గుండెలూ కొట్టీనారే. సీమూ రకతమూ ఉన్న మాకు సట్రున కోప వొస్తే ఆశ్చెర్యవేటి? రాకపోతే ఇంత పడాలి కాని.

ఆఫీసు కాడకి నడిచాను తిన్నగా. పెద్ద గేటు.. దాని ముంగల.. పెద్ద మీసాల గూరఖా... లోన కెళ్ళబోతే బందూకడ్డం పెట్టి... 'ఛో' అని కసిరాడు కుక్కని మల్లె. ఎంత దయిర్యం! నా అడివిలో నా బూమ్మీద ఆపీసు కట్టుకుని... నా మీదే అదికారం చెలాయిస్తాడా! తిన్నింటికి వాసాలు లెక్కెట్టినట్లు. నేనెవర్ననుకున్నాడు? 'నాకు పనికావాల...' అన్నాను. ఒక్క సిటం ఆలోచించి... బందూకు దింపి ఓవేపు చూపాడు అక్కడి కెళ్ళి అడగమన్నట్లు. వెళ్ళాను. ఆ గదిలో కురిసీ పీటమీద... ఎవరో బాబు... తీరిగ్గా కూసోని తెల్ల సుట్ట కాలుస్తున్నాడు. నెత్తిమీద ఇలాయి బుడ్డెలుగుతుంటే ఏటి సంగతి? ఎవర్నువ్వన్నట్లు చూశాడు కళ్ళతో, మాలాటోడితో మాటాడితే నోటి ముత్యాలు రాలిపోతాయన్నట్లే. దణ్ణవెట్టి దౌర్భాగ్యం సెప్పుకున్నాను. అంతా ఇని... "నీకు సదువుందా? సంద్యుందా? నువ్వేం పన్జెయ్యగల"వనేశాడు తేలిగ్గా. అప్పుడు నేను... "ఈ కొండా అడివీ మావి. సొమ్ము లెక్క దెలియక సవకలో మా అడివిని మీపరం జేశాం. విస్కీ మాయలో బికాఉలమై పోయాం బాబూ! డబ్బు మాయలో పడేసి... మా కొండల్ని బండల్ని మాసేతే పిండి జేయించారు. మా సెట్ల స్నేహితుల్ని మా సేతుల్తోనే పెరికించారు. మా సెమటతోనే మీ రోడ్డు వేయించు కున్నారు"

"ఇప్పుడా బండ పనుల్లేవు. మీ లాటోళ్ళవసరం లేదు, ప్రాజెక్టుకి, ఛో..."

నా గుండె కడుపు ఒక్కసారే భగ్గుమన్నాయి. అళ్ళు చేసిన దగా అరదమయింది. అళ్ళకుట్ర ఇడిపోయింది. మా కళ్ళని మా వేళ్ళతోనే పొడిపించారు. రూపాయినోట్లతో రంగుల మంటేసి మా బతుకులని మాచేతే కాల్పించేశారు. బంగారం మెరుపులు మెరిపిస్తూ కత్తులతో మా పీకలుత్తరించారు. సందమామని సూబిస్తూ పాములపుట్ట మీంచి నడిపించారు. సింహాసన మెక్కిస్తామని సల్లని కబురుసెబుతూ సమాదిలోకి తోసేసేరు. డబ్బుమాయలో మమ్మల్నెద్రిదవల్ని చేసొగ్గారు. ఎందుకు? దేసిసౌబాగ్గెం కోసం! ఎవరు? సదువు కున్నోళ్ళు. సదువుంటే... అమాయకుణ్ణుద్ధరించడాని క్కాదన్న మాట! ఎదుటోడి బతుక్కుత్తరించడాని కన్నమాట! నలుగురికీ మేలు చేయడానిక్కా దన్నమాట! పదిమందిని పాడుచేసి ఒకడు బాగుపడ్డాని కన్నమాట. ఇప్పసారా అంటూ ఇసం తాగించి మా బతుకులు బండలు జేశారు అపీసర్లు. పాజెక్టు కట్టేడానికి.

ఏటిబాబూ అంటారూ? దేసాబివృద్ధి కోసం అపాటి త్యాగాలు సెయ్యపోతే ఎలా? అనా... ఎంతమాట! సెయ్యాలి బాబూ... సెయ్యాలి. దేశం కోసం త్యాగాలు సెయ్యాల్సిందే కాని...

దేసమంటే ఏటిబాబూ? నేటి పాటలాటి మాటిన్నాను బాబూ.

దేసెమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్. ఔనాండి? మరి... దేసెమంటే మనుసులే ఐతే... అ మనుసులకి బతికే సౌబాగ్గెం పోయి... పస్తులకీ సావులకీ సిక్కడిపోయే దౌర్బాగ్గెం పడుతూంటే ఒక దేశాభివృద్దేటి బాబూ? మడుసుల్ని మట్టేసి దేశం బాగుపడ్డమెలా జరుగుతుందసలు? ఒక్కసా రాలోచించండి. గిరిజనుల మయినా మేమూ మనుసులమే. మేమూ దేశంలో బాగాలమే. మా బాగు మాత్రం దేశాని కక్కర్లేదా? ప్రెబువులూ! మా కొండోళ్ళమేమీ కోరరానివీ కొరగానివీ కోరుకోడం నేదు. మాకు ఒంటినిండా సిలుగ్గుడ్డ లక్కర్నేదు. నడుంకో గుడ్డపీలిక. మేమేమీ పరన్న మడగడం నేదు. సింత గింజల తోపా... మామిట్టెంకల జీడంబలీ... బవనాలు కొనాలండం లేదు. సుట్టు గుడిసెలు. టౌన్లంట ఉంటా మనడం లేదు. కొండల్లోనూ అడవుల్లోనూ... ఇస్కీలు తాగుతామనం. ఇప్పసారా శాన.

ఇంతసిన్న బతుకు కోరుకునే మా కొండోళ్ళ మీద పిచ్చుక మీద బ్రెమ్మాస్త్రంలా ఎంత పెద్ద దెబ్బ కొట్టారో సూడండి అపీసర్లు! పొట్టమీద కొట్టినోడిమీద కోపం రాక ముద్దొస్తదేటి మనిసన్నవోడికి? మా బతుకుల్నిలా చేశాడే అన్న బాదే తప్ప ఆ బాబు మీద మాకేటీ పగనేదు. మా బతుకులిలా ఐపోనాయ్ అన్న దిగులే తప్ప ఆ బాబు మీద నాకేటీ ద్వేసమూ నేదు. ఆరి మీద పగ పుట్టడానికారే మయినా నాకు సుట్టమా, బందువా? ముకమే తెలియనోరి మీద పగేటి బాబూ? అదీగాక మేం కొండోళ్ళం. సంపడానికి మాకు తెల్సిన ఇదానం వొకటే. బాణమేసి కొట్టడం. అర్ని సంపడమే నా ఉద్దేశమయితే... బాణమే గురి చూద్దునండి సాటునుంచి. ఐనా మేం ఆటవికులం... సాటి మనిసిని సంపమండి. తప్పుజేస్తే బుద్ధి సెప్పి వొగ్గేస్తామండి. ఆరు నాకు తెలియనే తెలియలే. సెత్రువెలా ఔతారు? మనిసి మీద పడి పీక కరిసేడానికి నేను మెకాన్ని కానండి. మనిసినండి.

సెంపమీద కొట్టినోడి సెయ్యిరిచీయా లన్నంత కోపమొచ్చి పడిపోతదే మనిసికి? మరి బతుకు మీద కొట్టినోడి మీదెంత కోపమొస్తతదండీ? ఆ కోపం తీరుసు కుందుకూ... ఆ తప్పుకి సిచ్చేసేందుకు... సెంప దెబ్బేద్దామని సెయ్యెత్తిన మాట సత్తెమేనండి. అంతే తప్ప అర్ని అంతం సెయ్యాలని నా అబిమతం ఎంత మాత్రమూ కానే కాదండి. మమ్మల్ని డబ్బు మాయజేసి సారామైకంలో తోసి మా ఇళ్ళూ వాకిళ్ళూ లాక్కుని మా కొండమీంచి కిందకి తోసి మా అడివి తల్లి ఒడినుంచి లాగేసి... మాకూ మా బతుక్కీ ఏమీ మిగలకుండా సేసి, మా అట, పాట... దేసం... ఆచారాలు... ఎవహారాలు...

సంప్రదాయాలు అన్నిట మీదా దెబ్బ కొట్టిన ఆపీసరు మీద... కుసింత పెయ్యెత్తుతే.. అదే నేరమా? అదే గోరమా? నాకు తెలవదండి. పెద్దలూ.. పెబువులూ.. దరమరాజులూ... తమరే విరవయించండి. తమరేం చెప్పినా తకరా రుండదండి, తలొంచుతానండి. సమ్మత మేనండి. ఏదేవా మ సిత్తమే నండి.

నా సోదంతా ఓపిగ్గా విన్నందుకు శెతకోటి దండాలు బాబూ.

నేను సెప్దామనుకున్నది సంపూర్నమై పోనాదండి.

"దండాలు బాబూ... సెలవండి."

* * * * *

# ఇడియట్ బాక్స్

ఉదయం పదకొండు గంటలు, అంటే–

కాలేజీ స్టూడెంట్లు ఎక్కువ మంది మార్నింగ్ షోల్లోనూ, అమ్మాయిల కాలేజీల ముందు, క్రికెట్ గ్రౌండ్‌ల్లోనూ, రోడ్ల మీద వుండగా, కొద్ది మంది మాత్రం క్లాస్ రూంలోనూ, హాస్టల్ గదుల్లోనూ వుండే వేళ.

రాష్ట్రంలోనే పేరు పొందిన ఆ ప్రయివేట్ కాలేజీ మగపిల్లల హాస్టల్. రూమ్ నెంబర్ 36లో ఓ అబ్బాయి, ఓ అమ్మాయి. అతను జీన్స్‌తోనూ, ఆమె చుడీదార్‌తోనూ ఆధునికతమ మోడల్స్‌లా వున్నారు. సందీప్, శిరీషల హాస్టళ్ళు వేరయినా కాలేజీ ఒక్కటే. ఇరవయ్యేళ్ళ అబ్బాయీ, 19 ఏళ్ళ అమ్మాయి ఒకే గదిలో తలుపులు మూసుకుని ఉన్నారనీ, వాళ్ళిద్దరూ ప్రేమించుకుంటున్నారనీ, జరగరానిదేదో జరుగుతోందనో అపార్థం చేసుకోనక్కర్లేదు. వాళ్ళిద్దరూ ఇప్పుడు ఏ కొత్త ప్రేమా ఎగరెయ్యలేనంత ఎత్తుల్లో, రంగుల ప్రపంచంలో విహరిస్తున్నారు.

పదకొండు గంటలంటే ఆ హాస్టల్‌కి పోస్ట్‌మాన్ వచ్చే వేళ కూడా. ఆ ఇద్దరూ ఎదురు చూస్తున్నది పోస్టుమాన్ కోసమే. ఐతే వీళ్ళ తహతహ తపాలా మనిషి ఎచ్చే మనియార్డరు కోసమూ కాదు, అమ్మా నాన్న రాసే ఉత్తరమ్ముక్క కోసమూ కాదు. నాలుగేళ్ళ సాన్నిహిత్యం వీళ్ళది. వీళ్ళిద్దరినీ దగ్గర చేసింది వాళ్ళ ఉమ్మడి అభిరుచీ, ధ్యేయమూ. ఇద్దరికీ సినిమాలంటే పిచ్చి. సినిమా క్విజ్‌లో విజేతలు కావడం వాళ్ళ జీవిత ధ్యేయం. ఆదర్శం. అందుకే వాళ్ళిద్దరూ జట్టు కట్టారు. కాలేజీలో కాలుపెట్టిన తొలి నెలలోనే ఇద్దరూ ఒకటై అప్పటినుంచి వివిధ పత్రికల సినిమా పజిల్స్‌నీ, సినిమా గళ్ళ నుడికట్లనీ సాధిస్తూ టీవీలో సినిమా పజిల్స్ స్థాయికి ఎదిగిపోయారు.

"మొన్నటికి మొన్న యాభై, నిన్న అరవై, ఈ వీకెన్నొస్తాయో!"

"కనీసం డెబ్బయి. సందీప్! ఫాన్ మెయిల్‌కి జవాబులు రాయొద్దూ పేరు వేదునా?"